ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిధులొచ్చేనా..

మరమ్మతులు జరిగేనా..!

◆ ఖరీఫ్ సమీపిస్తున్నా ప్రారంభంకాని జలాశయాలు, కాలువల నిర్వహణ పనులు

◆ చివరి ఆయకట్టుకు సాగునీరు కష్టమే..

◆ ప్రతిపాదనలకు స్పందించని ప్రభుత్వం



తుప్పలతో ఉన్న పెద్దేరు కాలువ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు ప్రకృతి సానుకూలంగావున్నా.. ప్రభుత్వం నుంచి సహకారం లభించే సూచనలు కానరావడం లేదు. జలాశయాలు, కాలువల మరమ్మతులు జిల్లాలో ఐదేళ్ల నుంచీ చేపట్టలేదు. దీంతో జలాశయాల చివరి ఆయకట్టుకు ఈసారీ సాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. కాలువల పూడికతీత, షట్టర్లు, గేట్లు మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పటికే నీరు వృథాగా బయటకు పోతోంది. ఖరీఫ్‌లో నీరు విడుదలకు ముందు గేట్ల లీకులు నియంత్రించడం, కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం వంటి పనులు ప్రతిఏటా చేపట్టాల్సివుంది. కానీ ఆ శ్రద్ధ గత ప్రభుత్వం తీసుకోలేదు. ఈ ప్రభుత్వమూ పంపిన ప్రతిపాదనలకు నిధులు విడుదలచేయలేదు. రైవాడ జలాశయ ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించిన 27 పనులకు రూ.2.87 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. చోడవరం, మాడుగుల మండలాల్లో కాలువలు, చెరువుల మరమ్మతుకు సంబంధించి 13 పనులకు రూ.76 లక్షలు, అనకాపల్లి, కశింకోట మండలాల్లో కాలువలు, చెరువుల తొమ్మిది మరమ్మతు పనులకు కోటీ 11 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. పెద్దేరు జలాశయ ఆధునికీకరణ పనులకు రూ.84.8 కోట్ల ప్రతిపాదనలు పంపగా గత ప్రభుత్వం నుంచీ కాగితాలకే పరిమితమైంది. నిధులు విడుదల చేయకపోవడంతో పనులు చేపట్టలేదు.

తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల కింద 84,763 ఎకరాల ఆయకట్టు వుంది. గతం కంటే జలాశయాల నీటి మట్టాలు మెరుగ్గావున్నాయి. వాతావరణ పరిస్థితులు సానుకూలంగా వుండడంతో రైతు ఈ ఏడాది గడువు ప్రకారం వరి సాగవుతందన్న ఆనందంలో వున్నాడు. కానీ, సాగునీరు చివరి ఆయకట్టు వరకు సరఫరా చేసే వ్యవస్థలను సమర్థవంతంగా తయారుచేయడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. తాండవ జలాశయ నీరు జులై 31న, రైవాడ, కోణాం, పెద్దేరు జలాశయాల నీరు ఆగస్టు మొదటి వారంలో విడిచిపెట్టాలని నీటిపారుదల శాఖాధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నీటి విడుదలకు ముందే యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు మిగతా 2లో..

ఎయు ఇన్‌ఛార్జి విసిగా శశిభూషణరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న శశిభూషణరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఆచార్య శశిభూషణరావు వర్సిటీలో విసిగా బాధ్యతలు స్వీకరించారు. ఎయు ఇసిఇ విభాగం సీనియర్ ఆచార్యునిగా, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 35 సంవత్సరాల సుదీర్ఘ బోధనా అనుభవం కలిగి ఉన్నారు. ఎయు నుంచి ఇసిఇలో బిటెక్, జెఎన్‌టియు నుంచి ఎంటెక్, ఉస్మానియా వర్సిటీ నుంచి పిహెచ్‌డిలను పూర్తిచేశారు. ఆచార్య శశిభూషణరావుకు 5 పేటెంట్‌లు సైతం ఉన్నాయి. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లు అందుకున్నారు. ఆయన 275కుపైగా పరిశోధనా పత్రాలను వివిధ స్కోపస్ జర్నల్స్‌లో ప్రచురించారు. ఐదు పాఠ్య పుస్తకాలను, వివిధ పుస్తకాలలో 11 ఛాప్టర్స్‌ను రచించారు. 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ బెస్ట్ అకడమీషియన్ అవార్డును, బెస్ట్ రీసెర్చర్ అవార్డును అందుకున్నారు.

ఆంధ్రకేసరి, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ వర్సిటీల విసిలుగా మూర్తి, విశ్వనాథ్ కుమార్

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం (ఒంగోలు) ఇన్‌ఛార్జి విసిగా ఎయు జర్నలిజం విభాగం ఆచార్యులు డివిఆర్.మూర్తి నియమితులయ్యారు. ఆయన మిగతా 2లో..

నేటి నుంచి రైతు బజార్లలో కిలో టమాట రూ.58

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని రైతు బజార్లలో కిలో టమాటాను రూ.58కి విక్రయించనున్నారు. కొద్ది రోజులుగా టమాట ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మార్కెట్‌లో కిలో రూ.70 నుంచి రూ.80కి లభిస్తోంది. కొనుగోలుదారులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మార్కెటింగ్ శాఖ అధికారులు చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను లాభం, నష్టం లేని విధంగా కొనుగోలు చేసి వినియోగదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ధరలు తగ్గేంత వరకూ ఈ విధంగానే కొనుగోలు చేసి అందరికీ అందుబాటులో ఉంచనున్నట్టు జాయింట్ కలెక్టర్, రైతు బజార్ల చైర్మన్ మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అగనంపూడి టోల్‌గేట్‌ను శాశ్వతంగా తొలగించాలి

▶ వార్త 2లో..

షిప్‌యార్డ్ సమస్యలపై తపన్‌సేన్‌కు వినతి

▶ వార్త 2లో..

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలి

▶ వార్త మెయిన్‌లో..

ఎర్రమట్టి దిబ్బలను పరిశీలించిన సిపిఎం నేతలు



ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గంగారావు, మూర్తి

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎర్రమట్టి దిబ్బలను దేశ సంపదగా అభివర్ణించారు. వాటిని కాపాడడం ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు. భీమునిపట్నం మూచివల్లీ ఎయిడెడ్ కో - ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 1979లో 379 ఎకరాలు కేటాయించినట్లుగా భీమిలి ఆర్‌డిఒ చెబుతుండగా 2014లో మరో జిఒ ఇస్తూ భూ కేటాయింపులు జరిపారని తెలిపారు. 2016లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అక్కడ మొత్తం భూమి 91 ఎకరాలను జియో హెరిటేజ్ భూములుగా గుర్తించి విభజించిందని ఆర్‌డిఒ అంటున్నారని తెలిపారు. ఆ విభజన ఎలా జరిగిందని, విభజనకు ప్రాతిపదిక ఏమిటని గంగారావు ప్రశ్నించారు. ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో ఉన్న భూములు జియో హెరిటేజ్ భూములుగా తమ పార్టీ క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రాథమికంగా గుర్తించామని అన్నారు. పలు చోట్ల సహజ సిద్ధమైన ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేసిన ఆనవాళ్లు కనిపించాయన్నారు. భౌతికంగా సర్వే జరపలేదని ఇట్టే స్పష్టమౌతోందని చెప్పారు. క్షేత్ర స్థాయి పరిశీలన జరపకుండానే జివిఎంసి లే అవుట్‌లకు ఎలా అనుమతులు ఇచ్చిందని, విఎంఆర్‌డిఎ, సిఆర్‌జెడ్ అనుమతులు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అవన్నీ పలు అనుమానాలకు దారితీస్తున్నాయని అన్నారు. 2014-19, 2019-24 మధ్య సంబంధిత భూముల కేటాయింపు ప్రత్యుత్తరాలపై వాస్తవాలు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మిగతా 2లో..



బాధితులకు చెక్కు అందజేస్తున్న సిపి

సైబర్ క్రైమ్ రికవరీ మేళాలో రూ.4.65 కోట్లు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సైబర్ క్రైమ్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రికవరీ మేళాను గురువారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. రికవరీ చేసిన రూ.4.65 కోట్లును 150 మంది బాధితులకు అందజేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేసిన సొమ్మును బాధితులకు తిరిగి అప్పగించినట్టు సిపి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ ఫకీరప్ప, డిసిపి-2 తుహిన్ సిన్హా పాల్గొన్నారు.

రోజంతా వాన

అల్పపీడనంతో మరో రెండు రోజులు ఇంతే.. ఉమ్మడి విశాఖలో భారీ వర్షాలకు అవకాశం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గురువారం రోజంతా వాన కురిసింది. వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. ముసురు వాతావరణం అలుముకుంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు 25 నుంచి 27 డిగ్రీలకు పడిపోయాయి. జనం కాస్త వేడి పరిస్థితుల నుంచి ఉపశమనం పొందినట్టు కనిపించారు. తుపాను ప్రభావంతో విశాఖ సాగర తీరంలో అలల తాకిడి నెలకొంది. మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఒకటి ఏర్పడడంతో ఇది మరో రెండు రోజుల్లో బలపడి ఒడిశా తీరం వైపునకు వెళ్లే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. అల్పపీడన ప్రభావంతో రాగల రెండు నుంచి మూడు రోజుల వరకూ పలు చోట్ల మోస్తరు వర్షాలు, రెండు మూడు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ వానలు కురుస్తాయి. విశాఖలో 2 సెంటీమీటర్ల వరకూ గురువారం వర్షం నమోదైంది. నగరంలో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. వచ్చే రెండు రోజులు వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండవాలు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేస్తోంది.

ప్రభావం ఎక్కువే అంటున్న వాతావరణ శాఖ

అల్పపీడన ప్రభావం విశాఖపై ఎక్కువగానే ఉండొచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు రాగల రెండు రోజుల్లో కురుస్తాయని, విశాఖ నగరంపైనా ఆ ప్రభావం ఉంటుందని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మరమ్మతులు జరిగేనా..!

పూర్తిచేయాలన్న పట్టుదలతో అధికారులున్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రతిపాదనలు అడగగానే పంపారు. నిధులు మాత్రం విడుదల కాలేదు.

జిల్లాలో పిల్ల కాలువలు సరిగాలేవు. గేట్లు నీటి సామర్థ్యానికి తగినట్లులేవు. వీటన్నింటినీ సాధారణ స్థితికి తీసుకురావడానికి నీటిపారుదలశాఖ వద్ద డబ్బులు లేకపోవడంతో ప్రభుత్వ నిధుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. తాండవకు 18 పనులు చేపట్టేందుకు రూ.1.82 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తాండవ కాలువ గట్లు అనేక చోట్ల కోతకు గురయ్యాయి. వీటిని మరమ్మతు చేయకపోతే కాలువల నీరు బయటకు పోతుంది. ఇతర జలాశయాల పరిధిలోని కాలువల్లో పూడికతీత, షట్టర్లు, గేట్లు, క్రాస్ రెగ్యులేటర్ల మరమ్మతులు చేయాల్సివుంది. తొందరగా చేపట్టాల్సిన ఈ పనులకు ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో ఏమీ చేయలేని స్థితిలో నీటిపారుదలశాఖాధికారులున్నారు.

ఎయు ఇన్‌ఛార్జి విసిగా శశిభూషణరావు

ప్రస్తుతం ఎయు పరీక్షల విభాగం డీన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎయు జర్నలిజం విభాగాధిపతిగా, బిఒఎస్ ఛైర్మన్‌గా, అంతర్జాతీయ భాషల అధ్యయన విభాగం డీన్‌గా, జపనీస్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసిగా ఎయు ఆర్కిటెక్చర్ విభాగం ఆచార్యులు జి.విశ్వనాథ్ కుమార్ నియమితులయ్యారు.

రోజంతా వాన

పేర్కొంటున్నారు. ఒడిశా తీరం వైపు వెళ్లే క్రమంలో వానలు అధికంగా పడతాయని, ఉరుములు, మెరుపులు ఎక్కువుగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

అగనంపూడి టోల్‌గేట్‌ను శాశ్వతంగా తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చట్ట విరుద్ధంగా అగనంపూడి వద్ద ఉన్న టోల్‌గేట్‌ను శాశ్వతంగా తొలగించాలని, ఎన్‌హెచ్ఎఐ నూతన టెండర్ రద్దుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు గురువారం జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. టోల్‌గేట్‌ను తొలగించాలని విశాఖ ప్రజలు అనేక సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నారని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మద్దిలపాలెం నుంచి అనకాపల్లి మధ్య 40వ కిలోమీటర్ వద్ద 1997లో ఈ టోల్‌గేట్ ఏర్పాటు చేశారన్నారు. మరుసటి ఏడాది నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. 2005లో అగనంపూడి ప్రాంతాన్ని, 2012లో అనకాపల్లి మున్సిపాలిటీని జివిఎంసిలో విలీనం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. టోల్‌ప్లాజా ఫీజు రూల్స్ ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టోల్‌గేట్‌లు ఏర్పాటుచేయకూడదన్నారు. ఆ ప్రకారం జివిఎంసి పరిధి దాటి 10 కిలోమీటర్ల దూరం తరువాతే టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నిబంధనలను ధిక్కరించి 2005 నుంచి టోల్‌గేట్ కొనసాగుతోందన్నారు. 2019లో టోల్‌గేట్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. దీనిపై ఎన్‌హెచ్ఎఐ సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ పొందిందన్నారు. కొత్తగా నిర్మించిన ఎన్‌హెచ్ 6 లైన్ల రోడ్డు మీద మర్రిపాలెం వద్ద ఒకటి, దుక్కవానిపాలెం వద్ద మరొకటి టోల్‌గేట్ నిర్మించిన అనంతరం అగనంపూడి వద్ద ఉన్న టోల్‌గేట్ తొలగిస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ ఇచ్చి స్టే ఆర్డర్ పొందిందన్నారు. మర్రిపాలెం, దుక్కవానిపాలెం వద్ద మూడేళ్ల నుండి టోల్‌గేట్ ఫీజులు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ అగనంపూడి టోల్‌గేట్‌ను తొలగించకుండా అక్రమంగా టోల్ ఫీజు వసూళ్లు చేస్తున్నారన్నారు. వాస్తవంగా ఈ 40 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలో ఖర్చుపెట్టింది కేవలం రూ.63.54 కోట్లు మాత్రమేకాగా 2018 వరకు సుమారు రూ.235.12 కోట్లు టోల్ ఫీజు వసూలు చేశారని, ప్రస్తుతం రోజుకు సుమారు రూ.25 లక్షలు టోల్ ఫీజు వసూలవుతోందని తెలిపారు. 2019 నుండి నేటివరకు సుమారు రూ.400 కోట్లు టోల్ ఫీజు వసూలు చేశారన్నారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.63.54 కోట్లు ఖర్చుపెడితే ప్రభుత్వం తిరిగి టోల్‌గేట్ ఫీజు ద్వారా రూ.869.44 కోట్లు ఆదాయం పొందిందన్నారు. ప్రజల నుండి అక్రమంగా ఇంత నిలువ దోపిడీ జరుగుతుంటే ఎటువంటి చర్యలూ తీసుకోకపోడం సరైంది కాదన్నారు. 2022 మే 26న జివిఎంసి కౌన్సిల్ సమావేశం అగనంపూడి టోల్‌గేట్‌ను వెంటనే తొలగించాలని 330/2022 తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిందని, అయినప్పటికీ టోల్‌గేట్ ఫీజు వసూళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు తరువాత కొద్ది రోజులు టోల్‌ఫీజు వసూళ్లు ఆగడంతో టోల్‌ఫీజు వసూళ్లు పూర్తిగా ఆగినట్లు ప్రజలు ఆనందపడ్డారన్నారు. తాజాగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఈ టోల్‌గేట్ కొనసాగింపునకు ఈ నెల 10న టెండర్లను ఆహ్వానించారన్నారు. ఇది చట్టవిరుద్ధమని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని టెండర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు.

28న విద్యా ప్రోత్సాహకాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి విశ్వనాథ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28న ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ అభినందన సభ నిర్వహించనున్నట్లు కేంద్ర గౌరీ (గవర) సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ తెలిపారు. గురువారం కేంద్ర గౌరీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు), ప్రముఖ వైద్యులు మళ్ల భాస్కర్ హాజరవుతారని తెలిపారు. ప్రతి ఏటా మాదిరి విద్యా ప్రోత్సాహంలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రతిభగల విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేయడం జరుతుందన్నారు. ఈ ఏడాది సుమారు 550 మంది దరఖాస్తు చేసుకున్నారనితెలిపారు. నిరుపేద గవర సామాజిక తరగతి పిల్లలను తమ సంఘం ఆధ్వర్యంలో చదివిస్తామని చెప్పారు.

షిప్‌యార్డ్ సమస్యలపై తపన్‌సేన్‌కు వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షిప్‌యార్డ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌కు షిప్‌యార్డ్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, అధ్యక్షులు బిఎస్ఎన్.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ విక్టరీ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. రూ.20 వేల కోట్లు విలువగల 5 ఎఫ్ఎస్ఎస్ వర్క్ ఆర్డర్స్‌లో 2 ఎఫ్ఎస్ఎస్ షిప్పులను ఎల్ అండ్ టికి ఇవ్వడం సంస్థకి ఆర్థికంగా నష్టం చేకూర్చే చర్య అని పేర్కొన్నారు. పలు కార్మిక సమస్యలనూ వివరించారు. వాటన్నింటినీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్తానని తపన్‌సేన్ తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆల్ ఇండియా స్టీల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కె.కుమార్ మంగళం పాల్గొన్నారు.

3న పల్లాకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాక అసెంబ్లీ నియోజవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందడమే కాకుండా టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆగస్టు 3న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ గురువారం మీడియాకు తెలిపారు.

లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. సిఐఐ విశాఖపట్నం ఆధ్వర్యంలో సిఐఐ విశాఖపట్నం కౌన్సిల్ సమావేశం గురువారం నగరంలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీభరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. సిఐఐ విశాఖపట్నం జోన్ అధ్యక్షులు గ్రంధి రాజేష్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వి.మౌళితో పాటు నగర పరిధిలోని 50 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరువానలో శ్రీ జగన్నాథ తిరుగు రథయాత్ర

ప్రజాశక్తి - విశాఖపట్నం కలెక్టరేట్ : వన్‌టౌన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర గురువారం సాయంత్రం జోరువానలో సాగింది. దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకష్ణ శ్రీనివాస్ టర్నర్ చౌల్ట్రీ వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫారమ్ నెం. యు.ఆర్.సి.-2

కంపెనీల చట్టం, 2013 అధ్యాయం XXIలోని పార్ట్ I కింద రిజిస్ట్రేషన్ గురించి ప్రకటన ఇస్తున్న ప్రకటన
(కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీల రూల్ 4(1) (రిజిస్టర్ చేయడానికి అధికారం) రూల్స్, 2014 ప్రకారం)

1. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం, ఇక్కడ నుండి పదిహేను రోజుల తర్వాత కానీ ముప్పై రోజుల గడువు ముగిసేలోపు విజయవాడలోని రిజిస్ట్రార్‌కు ఒక దరఖాస్తును సమర్పించాలని ప్రతిపాదించబడింది. అన్నపూర్ణ నిర్మాణాలు, విశాఖపట్నంలో (నం: 525 ఆఫ్ 2021)గా కంపెనీ రిజిస్ట్రార్ (ఒక భాగస్వామ్య సంస్థ) కంపెనీల చట్టం 2013లోని XXI అధ్యాయంలోని పార్ట్ I కింద, షేర్ల ద్వారా పరిమితం చేయబడిన కంపెనీగా నమోదు చేయబడవచ్చు.
2. ముసాయిదా మెమోరాండం ఆఫ్ అసోసియేషన్‌లో పేర్కొన్న విధంగా నిర్మాణ వ్యాపారం, అన్ని రకాల కాంట్రాక్ట్ పనులు, అంటే సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ & ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ పనులు మరియు ఇతర వస్తువులను కొనసాగించడం కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యం.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ప్రతిని డో.నెం. 49-27-60, మధురానగర్, విశాఖపట్నం-530016, ఆంధ్రప్రదేశ్, భారతదేశం వద్ద ఉన్న కార్యాలయంలో తనిఖీ చేయవచ్చు.
4. ఈ దరఖాస్తుపై అభ్యంతరం వ్యక్తం చేసే ఎవరైనా తమ అభ్యంతరాన్ని సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ **(CRC)**, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ **(IICA)**, సెక్టార్ 5లోని ప్లాట్ నెం. 6,7,8, **IMT** మనేసర్, గుర్గావ్, హర్యానా-122050, రిజిస్ట్రార్‌కు రాతపూర్వకంగా ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి ఇరవై ఒక్కరోజుల లోపు తెలియజేయవచ్చునని దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆప్రతిని డో.నెం. 49-27-60, మధురానగర్, విశాఖపట్నం-530016. నందు మా కంపెనీకి దాని నమోదిత కార్యాలయంలో ఒక కాపీని అందించండి.

అన్నపూర్ణ నిర్మాణాల కోసం
యల్ల రాఘవయ్య, పార్టనర్
తేది: 19-7-2024
డో.నెం. 49-27-60, మధురానగర్,
విశాఖపట్నం-530016. ఆంధ్రప్రదేశ్, ఇండియా

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
E.P. 70/2020 in O.S.958/2018

Between :
Sri Chadaram Srinivasa Rao ...D.Hr/Plaintiff
And :
Koribilli Venkateswara Rao & another ...J.Drs/Defendants

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్థిని తేది. **01-08-2024**న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **01-08-2024** ఉదయం గం॥ **10.30** ని॥ల నుండి సా॥ **5.00** గం॥ల మధ్య సమయంలో వేలం వేయుదురు సదరు వేలంపాటలో పాల్గనదలచిన ఆసక్తిగలవారు పై తేదిన, పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొన వచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

RCC building admeasuring 32.00 Sq.yds bearing D.No.33-14-291/1, Allipuram Ward, Block No.37, Town Survey No.1240, presently Ward No. 28, Allipuram, present Municipal Assessment No.1086188163, Visakhapatnam Greater Municipal Corporation and bounded by: **East:** House of Pachigolla Srirammurthy, **South:** Municipal Cement Road, **West:** Allipuram Main Road, **North:** House of Koribilli Ramakrishna.

DHR Value: Rs. 20,00,000/-
Amin Value Rs. 35,00,000/-
JDR Value: Not furnished

HABEEB SULTAN ALI
B. NARASINGA RAO, P. HYMA,
B. KAVITHA & G. SYAMALA DEVI
Advocates
Visakhapatnam, Cell: **9885355102**

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJUWAKA
O.S. 323/2023

Between:
CANARA BANK, Green City Branch, Gajuwaka, Rep. by its Branch Manager ...Plaintiff-Bank
And:
M/s. Venkateswara Enterprises & Another ...Defendants

SUMMONS

To,
D-1:M/s. Venkateswara Enterprises,
Rep. by its Proprietor:
Sri Vidyapathi Subhash,
D.No.720-6-31/1, Line No.1A,
Ground Floor, Shop No.1,
Sri Sai Brudavanagar,
Anakapalli-531001.
D-2:Sri Vidyapathi Subhash,
S/o. Asha James Prasad Kumar,
D.No.40-13-105, Dharmanagar,
Sivalayam, Kancharapalem,
Visakhapatnam-530008.

Please take notice that the above named plaintiff-bank has instituted the above suit against both of you for recovery of amount of **Rs.7,94,013/-** and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **14-08-2024** for your appearance on that day **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)

SUNKARA PADMAJA
M. PARVATEESAM
Advocates, Visakhapatnam-16

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.232/2021 in O.S.227/1984

Between:
Smt. Redla Koteswaramma...D.Hr
And:
Smt. Noorzahan ... J.Dr

NOTICE

To, **The J.Dr:**
Smt. Noorzahan,
W/o.Shaik Sukkar,
aged 65 years,
R/at Sunkuvanipalem,
Visakhapatnam.

Whereas the D.Hr filed a E.P against the J.Dr for delivery of vacant possession of the E.P. schedule property in pursuance of the decree passed in the above suit filed for specific performance and in pursuance of decree thereof a sale deed executed in favour of D.Hr on 04-08-2011 by the Court of the Principal Senior Civil Judge, Visakhapatnam on which day the property vested on the D.Hr. The above E.P stands posted to **08-08-2024** for your appearance in the above Court.You are therefore called upon to appear before the Court on **08-08-2024** at **10:30 A.M** either in person or through Advocate failing which the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)

Y. SUJATHA &
P. MURALI GOPAL
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A.274/2023 in O.S.480/2016

Between:
Smt. Botta Rajeswari ...Petitioner/Plaintiff
And:
Tulli Suryachandra Rao ...Respondent/Defendant

NOTICE

To,**The Respondent:**
Tulli Suryachandra Rao,
S/o. Late Earakayya,
Hindu, aged about 47 years,
Medical whole sale Business,
R/at D.No.2-130,
Pydimamba Colony,
Vepagunta, Visakhapatnam.

Whereas the above named Petitioner/Plaintiffh as instituted the above I.A.274/2023 for set aside the dismissal order dated 20-03-2023 and the matter stands posted to **22-07-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-07-2024** at **10:30 A.M** to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

B. KUMAR & K.A. RAO
Advocates,
Visakhapatnam

బియ్యం, కందిపప్పు అమ్మకాలకు ప్రత్యేక కౌంటర్లు



కందిపప్పును అందిస్తున్న సూర్యప్రకాష్ తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : వేములవలస పూల మార్కెట్ నుంచి శ్రీకాకుళం వెళ్లే మార్గంలోని శ్రీసూర్య ట్రేడర్స్ కిరాణా షాపులో బియ్యం, కందిపప్పు అమ్మకాలకు ప్రత్యేక కౌంటర్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్య ప్రకాష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ బిపిటి బియ్యం కిలో రూ.49కి ఈ కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఆనందపురం విఆర్‌ఒ అప్పలరాజు, సూర్య కిరాణాషాపు యాజమాని కొట్యాడ సూర్యారావు, షినగం సురేష్, వెల్లంకి నాగేశ్వరరావు, పచ్చిపులుసు కనకారావు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న మహిళా మార్ట్‌లో గురువారం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. రైతు బజార్లు పెద్ద సంస్థాగత రిటైల్డు దుకాణాల వద్ద సోనా మసూరి స్టీమ్డ్ బియ్యం 1 కిలో రూ.49కి, కందిపప్పు రూ.160 విక్రయించనున్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు కంటుబోతు లక్ష్మినాయుడు, డిసిఎస్‌ఒ జి.సూర్యప్రకాశరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ యోగి, ఎఎస్‌ఒ చైతన్య, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు సత్తిబాబు, సహాయ కార్యదర్శి బుగత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దాడి కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్యం మత్తులో పోలీసులపై దాడికి యత్నించిన ఐదుగురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను విశాఖ నగర ట్రాఫిక్ ఎడిసిపి శ్రీనివాసరావు గురువారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్న ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.శ్రీకాంత్, సిబ్బందిపై ఈ నెల 15 రాత్రి 11.30 గంటల సమయంలో బొమ్మలి మురళి, బి.మల్లేష్, పోలాకి ఢిల్లేశ్వరరావు, బల్లా బుజ్జి, బురి గిరీష్‌లు దాడికి యత్నించారు. మద్యం మత్తులో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుకు నిరాకరించడమే కాకండా పోలీసుల విధులకు అడ్డుతగిలారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాలువలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురం కారాడ వీధిలోని కాలువలో పసికందు మృతదేహాన్ని స్థానికులు గురువారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సమాచారమిచ్చారు. మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సచివాలయం పరిధిలోని ఉన్న ఆశ వర్కర్లను సిఐ వివేకానంద పిలిపించి మాట్లాడారు. దీనిపై విచారణ చేయాలని కోరారు. పసికందు మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. కేసును మల్కాపురం సిఐ వివేకానంద ఆధ్వర్యాన ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

పసికందు ప్రాణాలు తీసి కాలువలో పడేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జిపిఎస్ ఉత్తర్వులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : జిపిఎస్ ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు జి గంగాధరుడు డిమాండ్‌చేశారు. ఆనందపురం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలకు పంపాలని, ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 117 జీవోను వెంటనే రద్దు చేయాలని, కెజిబివిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంటిఎస్ వెంటనే అమలు చేయాలని, కెజిబివి పాఠశాలలన్నిటికీ వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని, 2022 జూన్ నుంచి ఉపాధ్యాయులు సరెండర్ చేసిన లీవ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.రమేష్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసు, జిల్లా నాయకులు సిహెచ్.కరుణాకరరావు, టి.రామకృష్ణారావు, జి.మురళీకృష్ణ, ఆర్.చంద్రకళ, జి.శ్రీదేవి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నౌకాదళానికి గీతం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎ.మిత్ర తేజ భారత నౌకాదళం నిర్వహించిన స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా సబ్ లెఫ్టినెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గీతంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తూనే ఎన్‌సిసిలో "సి" సర్టిఫికెట్ సాధించాడు. భారత నౌకాదళం (కోల్‌కతా) ఎస్‌ఎస్బి బోర్డు నిర్వహించిన పరీక్షలలో ఎంపికయ్యారు. భారత నౌకాదళానికి ఎంపికైన విద్యార్థిని ఇన్ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్‌సిసి అధికారులు మేజర్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, లెఫ్టినెంట్ డాక్టర్ బి.లక్ష్మి తదితరులు అభినందించారు.

వైభవంగా శ్రీకాంతకృష్ణమాచార్యులు సంకీర్తన జయంతి

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీకాంత కృష్ణమాచార్యులు సంకీర్తన జయంతి ఉత్సవాన్ని సింహాచలం అప్పన్న ఆలయంలో గురువారం ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన వైభవంగా నిర్వహించారు. స్థానాచార్యులు డాక్టర్ టిపి.రాజగోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు, అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యాన కృష్ణమయ్య సంకీర్తన జయంతిని జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో నాద నీరంజనం కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించేలా రూపకల్పన చేయటానికి లాంచన ప్రాయంగా గురువారం సంకల్పించారు. త్వరలో ఈ కార్యక్రమం అందుబాటులోకి వస్తుందని ఎస్ శ్రీనివాసమూర్తి తెలిపారు

జగన్నాథపురంలో డయేరియా

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో ఐదుగురికి డయేరియా వచ్చినట్లు ఎంపిడిఒ ఎం.అప్పలనాయుడు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ జగన్నాథపురం గ్రామంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి వాంతులు విరేచనాలు కనిపించిన సందర్భంగా ఐదుగురికి డయేరియా వచ్చినట్లు నిర్ధారించారు. పాండ్రంకి సూరి రాములు, నీలిమ, మతికాన జట్ల నాయుడు, నారాయణస్వామి, సాయి లక్ష్మికి డయేరియా వచ్చినట్లు నిర్ధారించి మెరుగైన వైద్య సేవ నిమిత్తం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.



గ్రామాన్ని సందర్శించిన డిపిఒ శ్రీనివాసరావు ఎంపిడిఒ అప్పలనాయుడు

ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.గంగునాయుడు మాట్లాడుతూ, మంచినీరు పరీక్ష జరిపామని, అందులో ఎలాంటి బ్యాక్టీరియా లేదని వివరించారు. మటన్ ద్వారా బ్యాక్టీరియా వ్యాపించి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులతో పాటు ప్రత్యేకమైన వైద్య సేవలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో బ్లీచింగ్, శానిటేషన్ చేయించామని తెలిపారు. ప్రజలు నీటిని వేడిచేసి వడకాచి తాగాలని వైద్యాధికారి గంగునాయుడు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి తోటగరువులో వీధి రోడ్లు, కాలువలకు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. జివిఎంసి నిధులు రూ.38.55 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు నిర్మించనున్నారు. పనులు త్వరితగతిన ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ వెంకటరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, వార్డు టిడిపి ఇన్‌చార్జ్ మద్దిల రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో వ్యర్థాల సేకరణ

ప్రజాశక్తి -మధురవాడ : రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ స్మార్ట్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ వాల్తేరు సంయుక్తంగా గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వ్యర్థ సేకరణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించాయి. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నాయని తెలిపారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్-సర్క్యులర్ ఎకానమి, ఐపిఎల్ గ్లోబల్ ఫోరమ్-2024 పేరిట జరిగే ఈ సదస్సులో నవంబర్ 27వ తేదీన స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని, దేశంలోని 600 పాఠశాల విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరికొత్త పద్ధతులను, వాణిజ్య సమూనాలను ఉపయోగిస్తున్న పరిశ్రమలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను అందజేస్తామన్నారు. సదస్సులో భాగంగా పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సాధన్ ఘోష్, డాక్టర్ తోరణి తదితరులు పాల్గొన్నారు.

బోటు యజమాని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు ఎగువపేటకు చెందిన బోటు యజమాని దూడ దాసుకు చెందిన బోటు రెండ్రోజుల క్రితం ప్రమాదవశాత్తు పూడిమడక ప్రాంతంలోని సముద్రంలో కొట్టుకు పోయినట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నాయకులు గంటా నూకరాజు తెలిపారు. బోటు ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని వివరించారు. బోటు పూర్తిగా దెబ్బతినడం వల్ల సుమారు రూ.40 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు చెప్పారు. పూర్తి స్థాయిలో నష్ట పరిహారం ఇచ్చి బోటు యజమాని కుటుంబాన్ని, ఉపాధి కోల్పోయిన కలాశీలను ఆదుకోవాలని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడును, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు.

'సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి'

ప్రజాశక్తి -మధురవాడ : జనసేన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు జరగనున్న నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల కోరారు. ఎండాడ భీమిలి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి భరోసా కల్పించేలా ప్రమాద బీమా అందిస్తున్నట్లు చెప్పారు. రూ.5 లక్షల ఇన్స్యూరెన్స్, ప్రమాదం జరిగి ఆసుపత్రి పాలైతే రూ.50 వేలు వరకు మెడికల్ పాలసీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



పార్కులో నిర్మించిన షెడ్

పార్కులో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి -మధురవాడ : పార్కులో ఉన్న ఆక్రమణలను తొలగించాలని షిప్‌యార్డ్ కాలనీ వాసులు కోరుతున్నారు. జివిఎంసి 8వ వార్డు పరిధిలోని షిప్‌యార్డ్ కాలనీలో పార్క్ కోసం స్థలం కేటాయించారు. పార్క్ స్థలం చుట్టూ జివిఎంసి అధికారులు ప్రహరీ నిర్మించారు. ఈ పార్కులో కొంత స్థలాన్ని ఆక్రమించి కొంతమంది రేకుల షెడ్ వేశారు. ఆ షెడ్లు తొలగించాలని కలెక్టర్‌కు, చినగదిలి తహశీల్దార్‌కు, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. అధికారులు స్పందించి పార్క్ స్థలంలో ఆక్రమణలు తొలిగించాలని కోరుతున్నారు.

నోటు పుస్తకాల వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి తోటగరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన సొంత నిధులతో గురువారం నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాకానుకలో విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇవ్వని కారణంగా తల్లిదండ్రులకు భారం కాకూడదని నోట్ బుక్స్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్, ఒమ్మి సన్యాసిరావు, గాడు అప్పలనాయుడు, గాడి సత్యం, పోలారావు, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రైల్వే ఒబిహెచ్ఎస్ కార్మికులకు సౌముక్ యాజమాన్యం నాలుగు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సెంట్రల్ లేబర్ ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహించారు. రైల్వేలో కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మోడీ ప్రభుత్వం డౌన్ డౌన్ అని, సౌముక్ కంపెనీ యాజమాన్యం నాలుగు నెలల బకాయి జీతాలను తక్షణమే ఇవ్వాలని, ఆ యాజమాన్యం ఇవ్వకపోతే రైల్వే మేనేజ్‌మెంట్ ఇవ్వాలని, కనీస వేతనం రోజుకు రూ.734 ఇవ్వాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సెంట్రల్ లేబర్ ఆఫీస్‌లో కార్మికులు వినతిపత్రం అందించారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) విశాఖపట్నం జిల్లా ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, హరి, రాముడు, లక్ష్మణ్, ఆనంద్, కిరణ్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రధాని ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రధాని మోడీ ప్రకటించాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1209వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని చెబుతున్నప్పటికీ కేంద్రంపై ఏ విధమైన ఒత్తిడీ తేవడం లేదన్నారు. సొంత గనులు, రా మెటీరియల్, బ్యాంకు రుణాలు ఇవ్వకుండా కర్మాగారాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలను కేంద్రంలోని మోడీ సర్కారు అమలుచేస్తోందన్నారు. ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ వర్కర్లకు మూడు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. శాశ్వత ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం వల్ల వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో సంఘం జోన్ కోశాధికారి వి.కృష్ణారావు, నాయకులు కె.కుమారి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అనపర్తి అప్పారావు, పిఎన్ఎం జిల్లా నాయకులు ఎం.చంటి, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం : అమర్‌నాథ్

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా రోడ్లమీద తిరిగే పరిస్థితి లేదని, ముఖ్యంగా వైసిపి కార్యకర్తలు, నాయకులపై కూటమి శ్రేణులు చేస్తున్న దమనకాండ రోజురోజుకూ మితిమీరిపోతుందని, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలతో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమాన్ని కాదని, అంతకన్నా ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామన్న కూటమి మాటలు నమ్మి ప్రజలు అధికారాన్ని ఇస్తే గడచిన 45 రోజుల్లో 1000కి పైగా దాడులు జరిగాయని ఆరోపించారు. 31 మంది ప్రాణాలు బలిగొన్నారని, 35 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, 300 మందిపై హత్యాయత్నాలకు పాల్పడ్డారని, 400 ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారని, 500 పైగా ప్రైవేట్ ఆస్తులపై దాడులకు దిగారని ఆరోపించారు. ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకర సంఘటనలపై చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీలో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వ స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎర్రమట్టి దిబ్బలు అంశంపై అమర్‌నాథ్ మాట్లాడుతూ చారిత్రక, పురావస్తు ఆధారాలతో కూడిన ఈ ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ ప్రాంతంలో అనుమతులు లేకుండా రోడ్ల నిర్మాణం, భూమిని చదును చేయడం, మట్టిని తరలించడం వంటి పనులను వెంటనే నిలిపివేయాలన్నారు. సిఆర్‌జెడ్ నిబంధనలను విరుద్ధంగా ఇక్కడ కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు.

'శ్వాస'తో ఊపిరితిత్తుల పరీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ద్వారా రూపొందించిన 'శ్వాస' సాఫ్ట్‌వేర్ పరికరంతో ఊపిరితిత్తుల పరీక్ష ప్రక్రియను విశాఖ నగరంలో తొలిసారిగా శంకరమఠం రోడ్డులోని వీ హెల్త్ కేర్‌లో ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పివి.సుధాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 'శ్వాస' సాఫ్ట్ వేర్ వైద్య రంగంలో కొత్త ఆవిష్కరణ అని, దీని ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

ఈ సాఫ్ట్ వేర్ టూల్ ఊపిరితిత్తుల్లో సమస్యను ప్రాథమికంగా గుర్తించి వైద్యులకు నివేదికను క్షణాల్లో అందిస్తుందన్నారు. ప్రజల్లో ఊపిరితిత్తుల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు ఇది తోడ్పడుతుందని తెలిపారు. ఈ పరికరం దగ్గు శబ్ద తరంగాలను విశ్లేషించడం ద్వారా సిఒపిడి, ఆస్తమా, క్షయ వంటి ఊపిరితిత్తుల అనారోగ్య పరిస్థితులను గుర్తిస్తుందని వివరించారు.

'శ్వాస' సాఫ్ట్‌వేర్ టూల్‌ను రుపొందించిన సాలిసట్ టెక్నాలజీస్ సంస్థ డెవలప్‌మెంట్ మేనేజర్ పి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ, వీ హెల్త్ కేర్ నిర్వహిస్తున్న డయోగ్నోస్టిక్ కేంద్రం ద్వారా 'శ్వాస'ను విశాఖ ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నరేష్, డాక్టర్ ఆర్‌వి.రవి కన్నబాబు, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కెఎమ్‌కె.రమేష్, చీఫ్ మేనేజర్ చిన్నంకృష్ణ, సిహెచ్ పార్వతి, కె.పృథ్వీరాజ్ పాల్గొని 'శ్వాస' కర పత్రాన్ని ఆవిష్కరించారు.

94, 97 వార్డుల్లో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన



97వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 94, 97 వార్డుల పరిధిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పర్యటించారు. 94వ వార్డు పరిధి ఆర్ఆర్ వెంకటాపురం, వెంకటసాయినగర్, వేపగుంట, ఎల్‌బి.నగర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఆర్ఆర్ వెంకటాపురంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని, వెంకట సాయినగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఇంటి పన్ను లేకపోతే వెంటనే పన్నులు వేసి మంచినిటి సౌకర్యం కల్పించాలన్నారు. వేపగుంట నాగలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్, అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో 94వ వార్డు కార్పొరేట్ బల్ల శ్రీనివాసరావు స్థానిక జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు

97వ వార్డు పరిధి చినముషిడివాడలోని శ్రమశక్తినగర్ మొదటి లే-అవుట్, చాణుక్య నగర్, సప్తగిరినగర్ కాలనీలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, జోనల్ కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రోడ్లు, కాలువలకు, కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరించాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఆవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి సోమశేఖర్ నాయుడు, రమణమూర్తి, చిన్నాజీరావు, శంకరప్రసాద్, జనార్ధన్, ముమ్మన గురువు, మహేష్, అర్జున్ డుంబారి ప్రభాకర్ పాల్గొన్నారు.

నిజాయితీకి నీరాజనం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎటిఎం మిషన్‌లో బయటకు వచ్చి ఉన్న డబ్బును పోలీసు స్టేషన్‌లో అప్పగించి ఓ వ్యక్తి తన నిజాయతీని చాటుకున్నాడు. ఈ ఘటన గురువారం ఆరిలోవ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఉదయం ఈశ్వర్ డబ్బులు తీసేందుకు ఆరిలోవలోని ఎస్‌బిఐ ఎటిఎంకు వెళ్లాడు. అప్పటికే ఎటిఎం మిషన్‌లో రూ.5 వేలు బయటకు వచ్చి ఉన్నాయి. అతనికంటే ముందు వచ్చిన వ్యక్తి డబ్బులు డ్రా చేసి ఎంతసేపటికీ రాకపోవడంతో వెళ్లి ఉండవచ్చని భావించాడు. వెంటనే దగ్గరలోనే ఉన్న ఆరిలోవ పోలీస్టేషన్‌కు వెళ్లి సిఐ గోవిందరావుకు విషయం చెప్పి రూ.5 వేలు నగదును అప్పగించాడు. దీంతో ఈశ్వరరావు నిజాయతీని మెచ్చుకొని సిఐ సిబ్బందితో కలిసి సత్కరించారు. పారితోషకం ఇచ్చారు.

'వైసిపి హయాంలో పర్యావరణ విధ్వంసం'

ప్రజాశక్తి-సీతమ్మధార : గతంలో ఎప్పుడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వ హయాంలో పర్యావరణ విధ్వంసం జరిగిందని జనసేన ప్రధాన కార్యదర్శి, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పర్యావరణానికి ఏ పార్టీవారు విఘాతం కలిగించినా తప్పేనన్నారు. అధికారుల సహాయ సహకారాలు లేకుండా ఎర్ర మట్టి దిబ్బలలో ఎవరూ తవ్వకాలు చేయలేరని స్పష్టంచేశారు. ఎర్రమట్టి దిబ్బలు తవ్వకానికి కారకులైన అధికారులపై కేసులు పెడతానని తెలిపారు. జియో హెరిటేజ్ ప్రాంతానికి విఘాతం కలిగించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. ఎర్రమట్టి దిబ్బలలో సర్వే చేసి వాటి పరిధిని గుర్తించాలని, చుట్టూ బఫర్ జోన్ ఏర్పాటు చేసి పరిరక్షించాలని కోరారు. వారసత్వ సంపదగా గుర్తించిన ప్రాంతాన్ని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ, ఎర్రమట్టి దిబ్బల విధ్వంసానికి శ్రీకారం చుట్టింది జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఆరోపించారు. ఎర్రమట్టి దిబ్బల వద్ద వైసిపి నాయకులకు చెందిన అనధికార లేఅవుట్లు ఉన్నాయన్నారు. భీమిలి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్స్ సొసైటీ ఆధ్వర్యాన ఎర్రమట్టి దిబ్బలలో పనులు జరుగుతున్నాయన్నారు. ఆరు నెలలుగా పనులు జరుగుతుంటే వైసిపి ప్రభుత్వం, అప్పటి మంత్రి అమర్‌నాథ్ ఏం చేశారని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టి దిబ్బలలో త్రవ్వకాలు చేస్తున్న భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రేమోన్మాది అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : ఉడా కాలనీలో ఈ నెల 16వ తేదీ రాత్రి యువతిపై దాడికి పాల్పడిన ప్రేమోన్మాది సిద్ధును న్యూపోర్టు పోలీసులు గురువారం అరెస్టుచేశారు. దీనికి సంబంధించి విశాఖ సిటీ డిసిపి-2 తుహిన్ సిన్హా గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సిద్ధు గతంలో విద్యార్థిని శ్యామలను తరచూ వేధించేవాడని తెలిపారు. దీనిపై ఏప్రిల్ నెలలో గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ తరలించారని వివరించారు. పోక్సో చట్టం కింద జైలుకు వెళ్లిన సిద్ధు బయటకు వచ్చి ఈనెల 16వ తేదీన గొంతువానిపాలెం వచ్చి శ్యామలపై దాడికి ప్రయత్నించాడు. తల్లి సింగంపల్లి సావిత్రి అడ్డుకోవడంతో ఆమె చేతికి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు ఎసిపి మోసేజ్ పాల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబుతోపాటు, మరి కొంతమంది సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు సిద్ధును విశాఖ విమల విద్యాలయం వద్ద పట్టుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సిద్ధుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో మహిళలపై ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బెయిల్ మీద వచ్చిన వారిని ఆయా పోలీస్ స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు పాఠ్యాంశాలను ఇష్టపడి చదవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. చైతన్య మహిళా కళాశాల 28వ వార్షికోత్సవం గాజువాకలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మహిళలు ఇంటా బయటా పనిచేస్తూ బహుముఖ పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపై ఎక్కువగా దృష్టి పెట్టాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ, తమ కళాశాల 1996వ సంవత్సరంలో గాజువాకలో ఏర్పాటుచేశామని తెలిపారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారుచేసి, సమాజానికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమహాలక్ష్మి మాట్లాడుతూ, కళాశాల సాధించిన విజయాలను వివరించారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శకుంతల, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ పరిధిలోని పెద్దిపాలెం, బోని ఫీడర్స్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, బోని రోడ్, కుసులువాడ, బిపి.కల్లాలు, గండిగుండం, మామిడిలోవ, రామవరం, భీమన్న దొరపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వేపగుంట : పద్మనాభపురం సబ్‌స్టేషన్, బంటా కాలనీ ఫీడర్‌పై కొత్త విద్యుత్ లైన్ పనుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బంటాకాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్, రవినగర్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడే సామాన్యుల పత్రిక ప్రజాశక్తి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-అనకాపల్లి

సామాజిక చైతన్యాన్ని ప్రజల్లో కల్పించి ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక ప్రజాశక్తి అని ప్రజాశక్తి సంపాదకవర్గం గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ప్రజాశక్తి పాఠకులతో 'నేటి సమకాలీన రాజకీయాలు- ప్రజల కర్తవ్యం' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. ప్రజాశక్తిని ప్రజల్లో మన పత్రిక అనే భావాన్ని పెంపొందించాలన్నారు. పాఠకుల దృష్టికి వచ్చిన సమస్యలను పత్రిక దృష్టికి తేవడం ద్వారా పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం అనేక ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొని నడిపించినట్లు తెలిపారు. ప్రజాశక్తి పార్టీ పత్రిక అనే స్థాయి నుంచి ప్రజల పత్రికగా మారాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడం ప్రజాశక్తి పత్రిక ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఉద్యోగ గిరిజన సమస్యలపై ప్రత్యేక అనుబంధాలు ప్రజాశక్తి ముద్రించినట్లు చెప్పారు. సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అనకాపల్లి బాధ్యులు కాళ్ల తేలయ్య బాబు, మల్ల చంద్రశేఖర్ ఆనంద్ మాస్టారు, త్రినాద్, న్యాయవాది సాయి లక్ష్మణ్, పెంటకోట శ్రీనివాసరావు, గండి నాయన బాబు తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనకాపల్లి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య, 12వ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ బివి.విజయలక్ష్మి, 11వ ఎంఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ ఏ.రమేష్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఏపి ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన యాక్సిడెంట్ డేటా ఆధారంగా ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలలో చనిపోయారని, వీరందరూ కేవలం హెల్మెట్ ధరించక పోవడమే కారణమని చెప్పారు. అందువల్ల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు, టౌన్ ఎస్సై రమణ పోలీసులు, నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని న్యాయ సేవా సంస్థ, పోలీస్, న్యాయవాదులు, డిగ్రీ కాలేజీ విద్యార్థులు చోడవరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తూరు జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని నినాదాలు చేశారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె డేవిడ్ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.కృష్ణవేణి, ప్రసాద్, సూర్యనారాయణ, పలువురు న్యాయవాదులు, పోలీసులు, డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి : గంజాయితో పట్టుబడ్డ ముద్దాయికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ అనకాపల్లి జిల్లా పదవ అదనపు జడ్జి గురువారం తీర్పు చెప్పినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం... 2018 నవంబర్ 2న అనకాపల్లి టౌన్ పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు నాటి ఎస్ఐ వి.అప్పారావు సిబ్బందితో మాటువేశారు. కృష్ణా జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన బొల్లా రాజు రైల్వే స్టేషన్ వైపుకు బ్యాగ్ తగిలించుకొని వెళ తుండగా పోలీసులు అతన్ని పట్టుకుని ప్రశ్నించారు. అతని బ్యాగ్ పరిశీలించగా అందులో ఎనిమిది కిలోల గంజాయి ఉంది. దీంతో అతనిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయస్థానం రాజుకు శిక్ష విధించినట్లు ఎస్పీ తెలిపారు.

బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా నలుమూలల నుంచి విద్యను అభ్యసించడానికి వచ్చే ఆడపిల్లలకు వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అనకాపల్లిలో మరో రెండు బాలికల వసతి గృహాలు నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి నుంచి ఎంతో ఆశతో ఉన్నత చదువులు చదువుదామని జిల్లా కేంద్రానికి వస్తే వసతి గృహాల్లో సీట్లు లేక వెను తిరగాల్సి వస్తుందని, దీంతో చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని జిల్లా కేంద్రంలో అదనంగా 2, వసతి గృహాలను ఏర్పాటు చేయాలని, లేకుంటే ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో తొలి తెలుగు అశోక చక్ర అవార్డు గ్రహీత కరణం వరప్రసాద్ కుటుంబ సభ్యులు, స్వాతంత్ర సమరయోధులు కీర్తిశేషులు మళ్ల అప్పారావు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి జనసేన పార్టీని బలోపేతం చేయడమే మన లక్ష్యం అవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూలం గోపి, మంగా ఈశ్వర్, తాడి రామకృష్ణ, శ్రీరాందాస్ గోవింద్, మళ్ల శ్రీను, బర్నికాన రాము, బుదిరెడ్డి చిన్న, విల్లూరి హరికృష్ణ, ఆళ్ల రామచంద్రరావు, బుద్ధ రాందాస్, శాంతి కుమారి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపును గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రి విద్యా పరిషత్ హాస్పిటల్ వారు నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ క్యాంపు ఇన్చార్జ్ డాక్టర్ ఈ శివకుమార్, మెడికవర్ సిబ్బంది గ్రామం నుండి బస్సుల ద్వారా హాస్పిటల్‌కు తరలించి ఎక్స్రే, ఈసీజీ, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులను అవసరమైన వారికి ఉచితంగా అందజేసి తిరిగి అదే బస్సు ద్వారా గ్రామానికి చేర్చడం జరుగుతుందని చెప్పారు.

పాటిపల్లి మోడల్ స్కూల్‌లో మోటారు మరమ్మతు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

జిల్లాలోని మునగపాక మండలం పాటిపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మోటారు మరమ్మతుతో విద్యార్థులకు నీటి సమస్య తీరిందని జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం తెలిపారు. మోడల్ స్కూల్‌కు దిక్కెవరు ? అన్న శీర్షికన ఈ నెల 17న ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురించిన కథనానికి స్పందిస్తూ ఆమె పాఠశాలను బుధవారం సందర్శించారు. మోటారు బాగుచేయించడంతో వసతిగృహ విద్యార్థులకు నీటి సమస్య తీరిందని తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి డిప్యుటేషన్‌పై కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌కు వెళ్లడంతో పిజిటికి అదనపు బాధ్యతలు అప్పగించే విషయమై పాఠశాల విద్య విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు.



మోటారును పరిశీలిస్తున్న డిఇఒ

ట్రిపుల్ ఐటికి ఎంపికైన అభిరామ్‌కు అభినందనలు



అభిరామ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి-కశింకోట : నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికైన మండలంలోని పరవాడపాలెం గ్రామానికి చెందిన అభిరామ్‌ను గురువారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అభినందించారు. ఉగ్గిని గంగునాయుడు సేవా సంఘం ఆధ్వర్యాన అభిరామ్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సంఘం వ్యవస్థాపకులు ఉగ్గిని రమణమూర్తి, నిమ్మదాల సన్యాసినాయుడు, కర్రి వెంకట సత్యనారాయణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అమర్‌నాథ్ అవినీతి ఫైల్స్ విడుదల చేస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతి అక్రమాలపై ఫైల్స్‌ను త్వరలోనే విడుదల చేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కసింకోట మండలం విస్సన్నపేట, బిఆర్‌టి కాలనీ భూముల కుంభకోణం, ల్యాండ్ పూలింగ్‌లలో జరిగిన అక్రమాలపై విచారణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బిఎస్ఎంకె జోగినాయుడు, పోలవరపు త్రినాద్, సబ్బవరపు గణేష్, కొణతాల రత్నకుమారి, సిరసపల్లి సన్యాసిరావు, నారపిన్ని చంద్రశేఖర్, తలారి కాశీ నాయుడు, మేడిశెట్టి సత్తిబాబు, కోన శీను, సందిన సునీల్, శిరసపల్లి రమేష్, చిన్నారావు, నూకరాజు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా రైతులు విత్తనం నుంచి పంటకోత వరకు నిర్దేశించిన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం నిర్వహించిన పొలంబడి గ్రామీణ విత్తనోత్పత్తి పథకం శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్ చిరంజీవి మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమానికి ఎంపికైన రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు, రసాయ అధికారులు జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారులు, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాంబిల్లి : పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్ఇజెడ్ అచ్యుతాపురం రాంబిల్లి పరిధిలో ఈ సంవత్సర కాలంలో అనేక ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పోయినప్పటికీ, సరైన భద్రతా చర్యలు చేపట్టని యాజమాన్యాలపై కార్మిక శాఖ, సేఫ్టీ ఇన్స్పెక్టర్, పర్యావరణ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని పేర్కొన్నారు. సాహితీ పరిశ్రమలో ప్రమాదం మరువక ముందే, సెంబయో ప్రమాదం, ఫ్యాస్సులేస్ ఫార్మా నేడు వసంతలో ప్రమాదం సంభవించిందని తెలిపారు. కార్మికుల ప్రాణాలంటే యాజమాన్యాలకు లెక్క లేదని, వారి లాభాలే పరమావధిగా కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని మండిపడ్డారు. ఒకే రోజులో కార్మికుల చేత రెండు షిఫ్టులు డ్యూటీలు చేయించుకున్న యాజమాన్యాలు ఉన్నాయన్నారు. నాసిరకం బాయిలర్లతో, రియాక్టర్లతో కంపెనీలు నడుపుతున్న యాజమాన్యాలపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రైతులు కల్లాల నుండి పొట్టేళ్లు, నాటు కోళ్ల అపహరణ

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కల్లాల వద్ద గొర్రెపొట్టేళ్ళు, నాటు కోళ్లను అపహరించుకుపోతుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయంతో పాటు పొట్టేళ్లు, నాటు కోళ్లను పెంచుతూ ఆదాయం పొందుతారు. గత రెండు రోజుల్లో మండలంలోని దిబ్బిడి గ్రామంలో వంక చెరువు కింద గల గొంపా మాలిబాబుకు చెందిన గొర్రె పొట్టేలను, గొంపా వరహామూర్తి, గొంప అప్పలనాయుడులకు చెందిన 15 నాటు కోళ్లను అర్ధరాత్రి సమయంలో ఎత్తుకుపోయారు. వీటి విలువ రూ.30 వేలుపై మాటే. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న ఈ కోళ్లను దొంగలు ఎత్తుకుపోతున్నారు. ఇదే కల్లాల వద్ద మూడు నెలల క్రితం ఒక గొర్రె పొట్టేలు, సుమారు 30 నాటు కోడి పుంజులను దొంగలు ఎత్తుకుపోయారని బాధితులు వాపోయారు. అర్ధరాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని, వీటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కుష్టు వ్యాధిగ్రస్తుడిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధిని తొలి దశలోనే గుర్తించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కుష్టు వ్యాధిని తొలి దశలోనే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్నిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ లూసి కార్డిలియా అన్నారు. మండలంలోని గవరపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆమె సందర్శించారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు, టీబి, ఎయిడ్స్ నివారణ విభాగం సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ, ఎఎన్ఎంలు ఈనెల 18 నుండి వచ్చే నెల రెండవ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించనున్నట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత అవసరమైన మందులను ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఓ డి నాగమణి, గణాంకాధికారి రామచంద్రరావు, డేట్స్ మేనేజర్ జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

రేపు గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామ సమీపం (పాండవుల మెట్ట) ఉత్తర వాహిని శారదా నది తీరాన ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ మెట్ల వద్ద నుంచి శనివారం స్వామివారి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అవుగడ్డ రామ్మూర్తినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సాయంత్రం 4 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమై, అక్కడ నుండి వాక ముత్యాలమ్మ తల్లి జంక్షన్, వెంకటరాజుపురం, తెనుగుపూడి భీమలింగేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా స్వామివారి ఆలయం వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కశింకోట : 132కెవీ కసింకోట సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, సంపతిపురం, వేట జంగాలపాలెం, రంగలివాని పాలెం, కుచంగి, కూండ్రం మొదలగు గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాజ్యాంగబద్ధంగా గ్రామాలలో నిర్వహించాల్సిన గ్రామసభలు సక్రమంగా జరగడం లేదని, వీటి నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.వి రమణ, మండల కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో అప్పలరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రామ సభలకు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, గ్రామ ప్రజలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక మండల నాయకులు కె. శ్రీను, సంతోష్, సిహెచ్ రమణ, జి. రజిని, ఆర్. వెంకట్రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

54 పశువులకు గర్భకోశ పరీక్షలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని వెదురుపర్తి రైతు సేవా కేంద్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల మిషన్ నిధులతో ఉచిత గర్భ కోశ చికిత్స శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 54 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టలు మందు, ఖనిజ లవణ మిశ్రమాన్ని ఉచితంగా అందించారు. పశు వ్యాధి నిర్ధారణ కోసం పశువులన్నిటికీ పేడ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బెహరా ప్రసాద్‌రావు, పశు గణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ అధికారి బి.రామ్మోహన్‌రావు, సహాయ సంచాలకులు బి.సౌజన్య, కశింకోట పశు వైద్యాధికారి ఆలఫన్స్ జార్జ్, శస్త్ర చికిత్స నిపుణులు బాను బాబు, శివ, గ్రామ సర్పంచ్ శనివాడ అరుణ, ఉప సర్పంచ్ కొండయ్య, ఎంపీటీసీ కొంతము రాము, నాయకులు పందులు ఎల్లయ్య నాయుడు, సగరపు సన్యాసి రావు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జిఒ 22ను తక్షణమే రద్దు చేయాలి

-ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు

-రైతు, కౌలు రైతుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి- మునగపాక

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో 22ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై గురువారం స్థానిక సచివాలయం వద్ద ఏపీ రైతు సంఘం, గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కొత్త ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం ఇస్తామన్న రూ.20 వేలు తక్షణమే అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం అమలు చేసి రైతాంగాన్ని అప్పుల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలుదారులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు బకాయి ఉన్న 9 వారాల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ గుమస్తా పి.ఆనందరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, రైతులు దాడి నాయుడు, ఆడారి రమణబాబు, పిసూరి సన్యాసినాయుడు, బి అచ్చం నాయుడు, సరగడం రమణబాబు, బి అప్పారావు, కే చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని అధికారులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. అచ్యుతాపురం ఎస్‌కెఆర్ లాడ్జిలో గురువారం ఎలమంచిలి నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. తడి పొడి చెత్త వేరు వేరు చేసి వాటి ద్వారా ఆదాయం వచ్చేలా ప్రయత్నాలు చేయాలన్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు పనిచేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దారులు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విస్తరణ పనులు వేగంగా చేయాలి

అచ్యుతాపురం జంక్షన్ విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశించారు. అచ్యుతాపురం జంక్షన్‌లో జరుగుతున్న విస్తరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్ అండ్ బి ఏఈ రాజు తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను ఎం జగన్నాధపురం గ్రామంలో గురువారం ఆ గ్రామ సర్పంచ్ కర్రెడ్ల బుల్లెమ్మ, మాజీ సర్పంచ్ కర్రెడ్ల ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కొండకర్ల జంక్షన్ నుంచి ఆయన్ను బైక్ ర్యాలీతో గ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం గజమాల వేసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం జగన్నాధపురం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు
90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించి ఇవ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చన్నాయుడు గేదెలు, ఆవులు పెంపకందార్లకు 90శాతం సబ్సిడీతో, గొర్రెలు మేకలు పెంపకందారులకు 70శాతం రాయితీతో ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్లు నిర్మిస్తామని చెప్పారని, ఇటువంటి వివక్ష సరికాదని, గొర్రెలు మేకలకు కూడా 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకలు పెంపకం దారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కంటే గొర్రెలు మేకల పెంపకందారులు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని, అలాంటి వారిని 30శాతం సొంతంగా భరించమనడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి సమ న్యాయం చేయాలని కోరారు. గొర్రెలు, మేకలకు జూన్ నెలలో అందించాల్సిన నట్టల నివారణ కొరకు డివార్మింగ్ వ్యాక్సినేషన్ జరగకపోవడంతో వర్షా కాలంలో రావడంతో అంటువ్యాధులు ప్రబలి వేలాది జీవాలు మృత్యువాత పడుతున్నాయని, వాటి నిర్మూలన కొరకు వెంటనే నట్టల నివారణ మందులు, అవసరమైన వ్యాక్సిన్లు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిడిసి రుణాలు రూ.88 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉరిగిటి శివ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గోకాడ దేముడు నాయుడు, డిఎస్‌బిసియు వైస్ ప్రెసిడెంట్ సబ్బి శ్రీనివాసరావు, పినిబోయిన అప్పారావు యాదవ్, బొట్ట వరహాలు, పల్లా సత్యారావు, పట్నల అప్పలరాజు, మిష్క రామరాజు, యలమంచిలి అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. బుచ్చెయ్యపేట మండలంలోని మంగళాపురం, కొండెంపూడి, నీలకంఠాపురం, ఎం భూపతిపాలెం, పోలేపల్లి గ్రామాల్లో కూడా గ్రామదేవతల పండుగలు నిర్వహించారు.

ఎ.కొత్తపల్లిలో...

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, రాయపురెడ్డి కృష్ణ,పి.వెంకటరమణ, చల్లా నానాజీ పాల్గొన్నారు.

పరమటమ్మ అమ్మవారి పండగ

కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామ దేవత శ్రీపడమటమ్మ తల్లి అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌వి.రంగారావు వర్ధంతి

ప్రజాశక్తి-కశింకోట : ప్రముఖ నటుడు సామర్ల వెంకట రంగారావు వర్ధంతి మండలంలోని గొబ్బూరు గ్రామంలో గురువారం నిర్వహించారు. ముందుగా ఎస్వీ రంగారావు చిత్రపటానికి తాళ్లపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉలింగల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీ రంగారావు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో సాంఘిక, జానపద, పౌరాణిక చిత్రాలలో ప్రతి నాయకుని పాత్రలో మెప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొంతిని చిరంజీవి, జెర్రిపోతుల నూకునాయుడు, తెరపల్లి శ్రీను, పచ్చికోర శ్రీను, రామకృష్ణ, బొడ్డపు గోపి, తిర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పరవాడ : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం శాంతి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు అగనంపూడి విజన్ కేర్ నేత్ర వైద్య సహాయకులు కె శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్ళు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాఠశాల కరస్పాండెంట్ బొండా అప్పారావు, ఏడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, హెచ్ఎం బొండ శ్రీధర్, జిల్లా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కడిమి హనుమంతరావు, డాక్టర్ కేజే నాయుడు, విజన్ కేర్ ప్రతినిధి కే సుధారాణి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు

ప్రజాశక్తి - మాడుగుల: హెల్మెట్‌ను ధరించి వాహనాలను నడిపితే ప్రమాదాల సమయంలో ప్రాణరక్షణగా ఉంటుందనికళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి అన్నారు. గురువారం డిగ్రీ కళాశాల విద్యార్థులతో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్‌ధారణ ఆవశ్యకతను వివరిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మాడుగుల బస్‌స్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం వల్ల వాహనదారుడికి ప్రాణ రక్షణతోపాటు వారి కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ మెంబర్స్, కోర్టు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు డాక్టర్ పులవర్తి పైడిరాజు, డాక్టర్ ఆర్‌వి రమణమూర్తి, రాజు, రామ్ కుమార్, ప్రసాదరావు ఎకనామిక్స్ అధ్యాపకులు నాగేశ్వరరావు, కామర్స్ అధ్యాపకులు నాగేశ్వరరావు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

పాడి రైతును ఆదుకోవాలి



ఎంపిడిఒ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతు

ప్రజాశక్తి-నక్కపల్లి : ఆరు రోజుల వ్యవధిలో నాలుగు ఆవులు మృత్యువాత పడడంతో జీవనాధారం కోల్పోయి రోడ్డున పడిన మండలంలోని రాజయ్యపేటకు చెందిన బాధిత పాడి రైతు పిక్క ఏడుకొండలను ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కోరారు .గురువారం బాధిత పాడి రైతు పిక్కి ఏడుకొండలుతో కలిసి ఎంపిడిఒ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పాడిపోషణే జీవనాదారంగా ఉన్న బాధిత పాడి రైతు పిక్కి ఏడుకొండలుకు చెందిన నాలుగు ఆవులు వింతవ్యాధితో మృత్యువాత పడ్డాయన్నారు. వడ్డీకి చేసిన అప్పులు ఎలా తీర్చాలో మదనపడుతున్నారు. బాధిత పాడి రైతు కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. తహశీల్దార్ , పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను కూడా కలిసి సమస్యను విన్నవించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, కె .కాశీరావు, ఎం.బాపూజీ,సిహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న సాయి పార్లర్ కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆర్‌టిసి ద్వారకా బస్‌స్టేషన్‌లో శ్రీరామ్ సాయి పార్లర్‌లో పనిచేసే 9 మంది కార్మికులకు యాజమాన్యం రెండు నెలలు బకాయి జీతాలు, ఇఎస్ఐ, పిఎఫ్ సొమ్మును తక్షణమే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా నాయకులు వి.కృష్ణారావు డిమాండ్ చేసారు. పార్లర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఆర్‌టిసి ఆర్ఎం కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ శ్రీరామ్ సాయి పార్లర్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా పార్లర్‌ను అర్ధాంతరంగా మూసివేసి, హైదరాబాద్ మకాం మార్చేశారని ఆరోపించారు. ఆర్‌టిసి సంస్థకు పార్లర్ యాజమాన్యం కట్టిన డిపాజిట్ రూ.25లక్షల నుంచి కార్మికుల వేతనాల బకాయి చెల్లించాలని, అలాగే ఇఎస్ఐ, పిఎఫ్ కింద జమచేయాల్సిన సొమ్ములకు రూ.6 లక్షలను మినహాయించాలని కోరాఉ. పార్లర్ యాజమాన్యం చేసిన మోసంపై కార్మికశాఖ అధికారులకు విన్నవించినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ధర్నా అనంతరం ఆర్టీసి ఆర్ఎంకు వినతిపత్రం అందజేసారు. ధర్నాలో సిఐటియు నేతలు వి.తులసీరాం,కె.కుమారి, వెంకట రావు, కార్మికులు నవీన్, మురళి, జ్యోతి పాల్గొన్నారు.

వైసిపి పాలన కుంభకోణాలమయం

- టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వైసిపి పాలనంతా కుంభకోణాల మయమనిజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి ఆరోపించారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసిపి పాలనలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల లూటీ జరిగిపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 75 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని దోచుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ లెక్కలోనే రూ.35,500కోట్లు ఉంటుందని అంచనా వేశారు. విశాఖలో కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారని, ఇళ్ల పట్టాల పేరు మీద రూ.10 వేల కోట్ల భూ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అధికారులను బెదిరించి భూములను బలవంతంగా బదలాయింపులు చేసుకున్నారు ప్రభుత్వ భూములు మాత్రమే కాదు, రామానాయుడు స్టూడియో, దసపల్లా భూములు సిబిసిఎంసి, హయగ్రీవ, ఎన్‌సిసి భూములు సైతం అడ్డగోలుగా లాగేసుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై శ్వేత పత్రం విడుదల చేస్తామని, వీటిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకుని, ప్రజో ప్రయోగానికి వాటిని వినియోగిస్తామన్నారు.

టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ, విజయసాయి వత్తాసులో దేవాదాయశాఖ అధికారి శాంతి విశాఖలో పెట్రోగిపోయారని, సిఎం కార్యాలయం నుంచి ఆదేశాలొస్తేగానీ, అమెను ఇక్కడ నుంచి కదపలేకపోయారన్నారు. కుమార్తె పేరుతో విశాఖలో సాయిరెడ్డి భూములు కొన్నారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు,జిల్లా అధికార ప్రతినిధి యర్నాగుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థి తండ్రికి నగదు బహుమతి అందజేస్తున్న డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జోగుంపేట జెడ్‌పి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ప్రధమస్థానంలో నిలిచిన మాకిరెడ్డి కౌశిక్ చరణ్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాయపు రెడ్డి జమీలు, కార్యదర్శి గండేపల్లి శ్రీరామ్మూర్తి, మిగిలిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ. పదివేలను అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన ఏళ్ల మౌనికకు రూ.5వేలు, తెలుగు సబ్జెక్టులో ప్రతిభ కనబరిచిన ఎల్.దుర్గాభవానికి రూ.2వేలు నగదు బహుమతులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వ విద్యార్థి మడ్డు మల్లేశ్వరరావుకు సంఘం తరపున రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. డిప్యూటీ డిఇఒను పూర్వ విద్యార్థులు స్థానిక ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుడివాడ శ్రీనివాస్, కిరణ్, నాకు మాస్టర్ హెచ్ఎం సరోజినీ, అడిగర్ల గోవింద్, పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనపై ప్రచారం



పరీక్షలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్

ప్రజాశక్తి -కోటవురట్ల: కుష్టువ్యాధి నిర్మూలనపై మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ అప్పారావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో కుష్టువ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ప్రభుత్వపరంగా అందిస్తున్న ఉచిత చికిత్స, మందులు, ఇతర ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ప్రధానంగా కాళ్ల తిమ్మిర్లు, స్పర్శ లేని మచ్చ, కనురెప్పలు మూత పడకపోవడం, ముక్కు నుంచి తరచూ రక్తం కావడం వంటి లక్షణాలను ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న జనసేన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :కార్యకర్తలంతా క్రియాశీల సభ్యులుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర సూచించారు.. గురువారం నర్సీపట్నం ఎన్‌జిఒ హోమ్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నర్సీపట్నం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రారంభించామన్నారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు దోహదపడుతుందన్నారు. పార్టీ క్రియాశీల సభ్యులకు ఏ పార్టీలో లేని విధంగా రూ.5లక్షల ప్రమాదబీమా, ఇతర ప్రయోజనాలుంటాయన్నారు కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, కోఆర్డినేటర్ అల్లు నరేష్, నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడి తల్లమ్మ జాతర

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో మరిడి తల్లమ్మ పండగను గురువారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారికి పసుపు కుంకుమ చీర సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో, వరి నాట్లు వేసేముందు ఈ పండుగను గ్రామస్తులు జరుపుకుంటారు. అమ్మవారిని స్థానిక నాయకులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద పలు సేవా సంఘాల సభ్యులు ప్రసాదాలు వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా విచిత్ర నేలవేషాలు,తప్పెటగుళ్ళు, భారీ బాణసంచా పేలుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్తెమ్మతల్లి పండగకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం సత్తెమ్మతల్లి పండుగ ఘనంగా జరిగింది. ఏటా ఆషాఢమాసంలో తొలి గురువారం అమ్మవారి పండుగ చేయడం ఆనవాయితీగా జరుపుకుంటారు.`లు గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ,మొక్కులు చెల్లించుకున్నారు ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది .చిన దొడ్డిగల్లు హైవే నుంచి ఆలయం వరకు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు .పండుగ సందర్భంగా ఆలయ ప్రాంతంలో తీర్థం జరిగింది .చిన్నచిన్న దుకాణాలును వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు.గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది .సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు .

మినరల్ వాటర్ పేరుతో దోపిడీ!

- నాణ్యత, నిబంధనలు బేఖాతరు
- ఇష్టారాజ్యంగా ప్లాంట్ల ఏర్పాటు
- పట్టని అధికారులు



ఆర్ఒ ప్లాంట్

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో మినరల్ వాటర్ పేరుతో యజమానులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు, ఎటువంటి అనుమతులు లేకుండా వాటర్‌ప్లాంట్లను నెలకొల్పడమే కాకుండా, ఇష్టారాజ్యంగా నీళ్ల వ్యాపారం చేస్తూ ప్రజల జేబులను గుల్లచేస్తున్నారు. మూడుబాటిళ్లు, ఆరు క్యాన్‌లుగా సాగుతున్న ఈ వ్యాపారంతో ప్లాంట్ల నిర్వాహకులు భారీగానే పోగేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

అయితే నాణ్యత,స్వచ్ఛమైన నీటి పేరుతో జోరుగా సాగుతోన్న ఈ వ్యాపారంలో నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘన జరుగుతోందనే ఆరోపణలున్నాయి.నాణ్యత ప్రమాణాలను, ఆరోగ్య పరిరక్షణ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా భూగర్భ జలాలను వినియోగిస్తూ నీటితో వ్యాపారం చేస్తున్నారు, ప్రభుత్వ నుంచి పంచాయతీల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మండలంలో పలు గ్రామాలలో వాటర్ ప్లాంట్‌లను నిర్వహిస్తున్నారు అయినప్పటికీ అటువైపు అధికారులు వీటివైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో నాణ్యమైన నీటిని తాగాలన్న ఆశతో, డబ్బులిచ్చి రోగాలను కొనితెచ్చుకుంటున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

వాటర్‌ప్లాంట్ సరఫరా చేస్తున్న నీటి నాణ్యతపై ఎన్నో ఆరోపణలు, అనుమానాలున్నా అధికారులెవరూ వీటివైపు చూసే పరిస్థితి లేదు. దీంతో ఇష్టారాజ్యంగా బోరు నీటిని వాటర్ ప్లాంట్ ద్వారా విక్రయిస్తున్నారనే అపవాదు ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్ అమ్ముతూ, అడ్డుగోలుగా సాగుతున్న నీటి వ్యాపారంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఇదిలా ఉండగా మండల కేంద్రంలో నాటి టిడిపి ప్రభుత్వం మండలవ్యాప్తంగా మినరల్ వాటర్ అందించేందుకు తాహసిల్దార్ కార్యాలయం వద్ద మూడు బోరు బావులు మోటార్ షెడ్‌లు సహా వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటర్ ప్లాంట్ నిర్వహణ పనులు అటకెక్కించారు. నిరుపయోగంగా ఉన్న వీటిని వినియోగంలోకి తెచ్చి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

పనులు చేసినా పైసలు లేవాయే..!

- 13 వారాలుగా అందని ఉపాధి వేతనాలు
- కుటుంబపోషణకు కూలీల అవస్థలు
- వేతన చెల్లింపు ఊసెత్తని అధికారులు
- రూ.కోట్లలో ఉపాధి బిల్లు బకాయిలు

ప్రజాశక్తి -గొలుగొండ: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు 13 వారాలుగా బిల్లులు చెల్లించపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.ఉపాధి హామీ చట్టంలోని నిబంధనల మేరకు పనులు చేసిన కూలీలకు వెంటనే పేస్లిప్పులు అందజేయడంతోపాటు రెండువారాల్లోనే ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలి, లేని పక్షంలో వారికి వడ్డీతో సహాచెల్లించాలన్న నిబంధన ఉన్నప్పటికీ అధికారులకు, పాలకులకు పట్టడంలేదు. దీంతో పనులు చేస్తున్నా, కూలీ డబ్బులు వారాల తరబడి అందకపోవడంతో కుటుంబపోషణకు పేదకూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

అనకాపల్లి జిల్లాలో సుమారు రూ.30 కోట్ల మేర ఉపాధి కూలీలకు బకాయిలు పేరుకుపోగా, కూలీల వేతనం మూడు నెలలుగా ఇవ్వకపోవడాన్ని కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి స్పష్టమౌతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు పదివేల జాబ్ కార్డులు ఉండగా, అందులో 8170 జాబ్‌కార్డుదారులు ఉపాధి పనులకు వస్తున్నారు. వీరిలో రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఉపాధి పనులు చేపట్టగా వచ్చి కూలీ డబ్బులే జీవనాధారంగా ఉన్నవారు అనేకమంది ఉన్నారు. అయితే ఉపాధి పనులు చేసి 13 వారాల గడిచినా నేటికీ ఒక్క రూపాయి కూలీ డబ్బులు చెల్లించలేదు. ఏ పనికి వెళ్లకుండా కూలీలంతా ఉపాధి పనినే జీవనాధారం చేసుకుని పనిచేస్తున్నారు. వేతనాలు లేక ఇంట్లో నిత్యవసర సరుకులు కూడా కొనుగోలు చేసుకోలేని దుస్థితిలో ఉన్నారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తినా వైద్యం చేయించు కోవడానికి చేతిలో చిల్లిగవ్వలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్టుగా పలువురు కూలీలు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకి ఉపాధి కూలీలకు బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టాలని పలువురు కూలీలు కోరుతున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి


సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఉపాధి కూలీలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఆరు వారాల నుండి వేతన బకాయిలు ఇవ్వలేదన్నారు. బకాయిలు చెల్లించకపోతే ఏం తిని బతకాలని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ.600 కూలీ ఇవ్వాలని, అలాగే 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, ఈశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం


బాధితురాలికి నగదు, బియ్యం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేటలో అగ్ని ప్రమాద బాధితురాలు పిక్కి పాపయ్యమ్మకు గ్రామ టిడిపి నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు .పాపయ్యమ్మకు చెందిన పూరిల్లు శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది .దీంతో ఆమె సర్వం కోల్పోయింది గురువారం స్థానిక టిడిపి నాయకులు రూ.20 వేల నగదు ,25 కిలోల బియ్యం పాపయ్యమ్మకు అందజేశారు. విషయం తెలుసుకున్న హోంమంత్రి అనిత సూచనల మేరకు పార్టీపరంగా వ్యక్తిగత సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిక్కి శ్రీనివాసరావు, ఎంపిటిసి, పిక్కి సత్తియ్య, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పిక్కి రాంబాబు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, పిక్కి కోటి, సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు పాల్గొన్నారు .

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: మాజీ ఎమ్మెల్యే ముట్టడం వీరవెంకట సత్యనారాయణ 17వ వర్ధంతిని మండలంలో సిహెచ్ నాగపురం గ్రామంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంవివి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ, చింతపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా అప్పట్లో ఎంవివి సత్యనారాయణ విశేషకృషి చేశారన్నారు ముఖ్యంగా. సిహెచ్ నాగపురం గ్రామానికి రహదారి, వంతెన నిర్మాణం, మంచినీరు, కరెంటు సదుపాయాలను కల్పించారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనగాని రామారావు, సీనియర్ నాయకులు బొప్పన ప్రసాద్, సేనాపతి వరహాలు , సేనాపతి సత్తిబాబు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం హామీని అమలు చేయండి


వినతిపత్రం ఇస్తున్న రైతులు, సిపిఎం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయాన్ని వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్ కోరారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చందనాడ, రాజయ్య పేట, బంగారమ్మపేట గ్రామ సచివాలయాల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ.ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు .

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున కొత్త ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడులు రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులకు, కౌలు రైతులకు అందించాలని కోరారు. రూ. 2 లక్షల వరకు రైతులకు, కౌలు రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతు విమోచన చట్టం చేయాలని, రైతాంగాన్ని అప్పుల బారి నుండి కాపాడాలని, రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జిఒ.22 ను వెంటనే రద్దు చేయాలని కోరారు .భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు కూడా వర్తింపజేయాన్నారు. ఉపాధి కూలీలకు వెంటనే బకాయి పేమెంట్లు చెల్లించాలని ,సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ,రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు కోడా కాశీ, పి.ఏడుకొండలు, సిహెచ్ రాజు, పి.సత్తి బాబు, ఎం.బైరాగిరాజు, పి.సువర్ణరాజు పాల్గొన్నారు

శ్రీసాయి కళాశాల యాజమాన్య వైఖరిపై
ప్రజా సంఘాల ఆందోళన



నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల యాజమాన్య వైఖరిని ఖండిస్తూ గురువారం కళాశాల వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దర్నా చేపట్టారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియూ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ముఠా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, విద్యార్థులపై దాడికి పాల్పడిన యాజమాన్యంపై పోలీసు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. యాజమాన్యంతో మాట్లాడి సంజాయిషీ చెప్పించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించడంతో ఆందోళనను విరమించారు.

ఈ సందర్భంగా ఐద్వా, సిఐటియు నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై కాలేజ్ యజమాన్యం తీరు సరికాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని హెచ్చరించారు. ఆందోళనలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, ట్రెజరర్ కేవి.సూర్యప్రభ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ, జనార్దన్, అర్జున్, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, టి.ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బంటు సోమరాజు,ముఠా కార్మిక నాయకులు ఎన్ రాము పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నతో జిల్లా కలెక్టర్ భేటీ


స్పీకర్ అయ్యన్నతో సమావేశమై కలెక్టర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. గబ్బాడ ఇసుక రీచ్‌పై విలెంనత త్వరగా సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, అద్దె జెసిబిల సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు చేపట్టాలన్నారు. వేములపూడి గర్ల్స్ హాస్టల్‌లో సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిసర ప్రాంతం అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. వారితో పాటు నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం, మున్సిపల్ కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్టచర్యలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : జిల్లాలో గంజాయి నిరోధించేందుకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ దీపిక పాటిల్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. గురువారం నర్సీపట్నంలో స్పీకర్‌ను ఎస్పీ దీపిక పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు. ఏజెన్సీలో పండిస్తున్న గంజాయి జిల్లాలోని మైదాన ప్రాంతాల్లో విచ్చలవిడిగా రవాణా జరుగుతోందని, దీనిపై పటిష్ఠ నిఘా పెట్టి అరికట్టే చర్యలు చేపట్టాలని సూచించారు. యువతను పెడదోవ పట్టిస్తూ, వారిని బానిసలను చేయడం ద్వారా వారి భవిష్యత్‌కు నాశనం చేసే గంజాయిపై పోలీసుల చర్యలు కఠినంగా ఉండాలని సూచించారు. జిల్లాలో నేరాల సంఖ్య తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.


అయ్యన్నను అభినందిస్తున్న ఎస్‌పిదీపిక

పలు పాఠశాలలను సందర్శించిన
డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని చోద్యం, జోగంపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల, కృష్ణదేవిపేట ఆర్కే పబ్లిక్ స్కూల్‌ను డిప్యూటీ డిఇఒ పి.అప్పారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు ఎలా పాఠాలు చెబుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై తగు సూచనలు చేశారు.కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ, హెచ్ఎం వి.సరోజిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.